మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన ఆదిబట్ల నూతన వైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ వైర్మన్ కామండ్ల యాదగిరి తదితరులు

ఆదిబట్ల, ఏప్రిల్ 7: ఆదిబట్ల మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన మర్రి నిరంజన్ రెడ్డి, వైస్ చైర్మన్ కామండ్ల యాదగిరి ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఆదిబట్ల మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడి పోయిందని ఇప్పటికైనా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ తోటి సభ్యులతో కలిసి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగ ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదగిరి మాట్లాడుతూ త్వరలోనే మున్సిపాలిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హరిదాసు, నాయకులు నల్లబోలు పాండు రంగారెడ్డి, రాంరెడ్డి, సంరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఉదయ్‌పాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నందివనపర్తిలో చలివేంద్రం ప్రారంభం

నందివనపర్తిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

యాచారం, ఏప్రిల్7: మండలంలోని నందివనపర్తి గ్రామంలో బీఎన్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ట్రస్టు చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండే ఎండల్లో ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మట్టి కుండలో చల్లని నీటిని తాగడంతో ఎండ నుంచి ఉపశమనంతో పాటుగా ఎన్నో విధాలా ఆరోగ్య లాభాలున్నాయన్నారు.కార్యక్రమంలో పంది సుధాకర్, మహేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ముత్తు

యాచారం, ఏప్రిల్ 7: మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మంగలి అలివేలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పగడాల కనకయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్ పగడాల ముత్తు బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆదివారం అందజేశారు. మృతురాలి కూతుర్ల విద్యకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కామేటి బాలరాజు, నరసింహ, శివశంకర్, లింగం, నవీన్, భాను తదితరులున్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

జేపీఎల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

మంచాల, ఏప్రిల్ 7: మంచాల మండలం జాపాల గ్రామంలో జేపీఎల్ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులను పంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు భాస్కర్, బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్, యువజన సంఘాల సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి సూపర్ స్ట్రిక్కర్స్ జట్టుకు రూ. 22వేలు, రెండవ బహుమతి సూపర్ కింగ్స్‌టీం జట్టుకు రూ. 15వేలు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అశ్యకు రూ.5,500 ఎన్ కృష్ణ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బి.మల్లప్ప, ఆర్గనైజర్లు మహేశ్‌గౌడ్, చంద్రకాంత్, సత్తి, నర్సింహ, లింగం, జయకాంత్‌రెడ్డి, సందీప్, సిద్దు, సింగారం పరమేశ్, హల్తాఫ్, మహేశ్, బాల్‌రాజ్ పాటు పాల్గొన్నారు.

6 గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500లకే వంట గ్యాస్ పథకం అమలు చేయడంలో విఫలమైందన్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ఒట్టి బూటకమన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే హామీలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజా ఆశీర్వాద యాత్ర సోమవారం చేవెళ్ల నియోజకవర్గంలో కొనసాగుతుందన్నారు. సమావేశంలో వెంకట్ రాంరెడ్డి, శర్వలింగం, నాగరాజు, కృష్ణ, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 7: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనునిత్యం పనుల్లో నిమగ్నమై ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని, దీంతో వివిధ రోగాల బారిన పడుతున్నారన్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎక్కువగా నీళ్లను తాగడంతో పాటు ఉదయం సమయాలలో వ్యాయామం చేయాలని, తగిన నిద్రతో పాటు ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. సమయానికి భోజనం చేయకపోవడం, మానసిక ఒత్తిడి, వ్యాయామం, యోగా వంటి చేయకపోవడమే వ్యాధులకు కారణమన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

ప్రకృతి పరిరక్షణతోనే ఆరోగ్యం

ఆరోగ్య దినోత్సవంలో రాజేందర్‌రెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 7 : ప్రకృతి, పర్యావరణం, సహజ వనరులు బాగుంటేనే ప్రాణకోటి ఆరోగ్యం బాగుంటుందని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని గాంధీయన్ బీఈడీ కాలేజీలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వైద్యులు కేవై రామచంద్రం మాట్లాడుతూ.. 'నా ఆరోగ్యం.. నా హక్కు' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రపంచాన్ని కలవర పెట్టిన కరోనా వచ్చాకే ఆరోగ్యానికి మరింత ప్రాధాన్యం పెరిగిందన్నారు. కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, చైతన్యారెడ్డి, శివారెడ్డి, సుభాష్‌చంద్ర, పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత టీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరుల హితాన్ని కోరుకోవాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 7: ప్రతి ముస్లిం అల్లా అడుగుజాడల్లో నడుస్తూ పరుల హితాన్ని కోరుకోవాలని జామియా మసీద్ ఇమామ్ మౌలానా అబ్దుల్ వహీద్ సూచించారు. శనివారం రాత్రి పట్టణంలోని జామియా మసీద్‌లో, అహ్మద్ధేహిలాల్ మహమ్మదీయ మసీద్‌లో షబే ఖదర్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు తరావి నమాజ్ బయాన్‌లను మౌలానాలు నిర్వ హించారు. ఆయా మసీద్‌ల అధ్యక్షుల ఆధ్వర్యంలో మసీద్ ఇమామ్‌లు వహీద్, అతీఫ్‌లను ఘనంగా సత్కరించారు.

రెండు ఇండ్లల్లో చోరీ

నందిగామ, ఏప్రిల్ 7: గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి రెండు ఇండ్లల్లోచోరీకి పాల్పడిన ఘటన నందిగామలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామానికి చెందిన లంకల వినీతమ్మ తన కుమార్తెతో కలిసి ఇంటికి తాళం వేసి శనివారం హైదరాబాద్‌కు వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని రూ.30,000 నగదు, రెండు తులాల బంగారం, ఇంటి పక్కనే ఉన్న లక్ష్మమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి రూ.5000 నగదును ఎత్తుకెళ్లారు. లంకల వినీతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ సీఐ తెలిపారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

ఆమనగల్లు, ఏప్రిల్ 7: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం జరుగనున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోనుగోటి అర్జున్‌రావు మాట్లాడుతూ ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన దిశానిర్దేశం చేస్తారాని, దీన్ని దృష్టిలో పెట్టుకుని మండంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాడ్గుల : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం జరుగనున్న బీఆర్ఎస్ పార్లమెంటరీ విస్తృతస్థాయి సమావేశానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పోలే మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్

నందిగామ, ఏప్రిల్ 7 : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. నందిగామ మండలం చేగూరు గ్రామంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేగూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఎంపీగా క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి

యాచారం, ఏప్రిల్ 7: బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత లోక్‌సభ ఎన్నికల్లో సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు పెద్దపీట వేసినట్లు ఆయన తెలిపారు. ఇబ్రహీపట్నం నియోజక వర్గానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన క్యామ మల్లేశ్‌కు భువనగిరి ఎంపీ టికెట్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. త్వరలో మండలంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి, పార్టీ శ్రేణులను మరింత ఉత్సాహ పరచనున్నట్లు తెలిపారు. పార్టీ నుంచి ఒకరిద్దరు వెళ్లినంత మాత్రన ఒరిగేదేమీలేదని అన్నారు.

ఇబ్రహీంపట్నంరూరల్ : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపుకోసం పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు, రాయపోల్ ఎంపీటీసీ అచ్చన శ్రీశైలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మంచాల, ఏప్రిల్ 7: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్‌విందులు నిలుస్తాయని వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు వాజీద్, జానీపాషా, సలాం, ఎంపీటీసీలు శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, సురేశ్, బాల్‌రాజ్, లింగం గౌడ్, మహేశ్, ఫహీజ్, యునీస్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు అందజేత

దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న శ్రీనివాస్

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 7 : మండలంలోని రామన్నగూడ గ్రామంలో నిర్మిస్తున్న హన్‌మాన్ దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. చేవెళ్ల గ్రామానికి చెందిన కుంచం శ్రీనివాస్ 11వేలను దేవాలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. వారి వెంట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి వృథాను అరికట్టాలి

మన్సూరాబాద్, ఏప్రిల్ 7: మంచినీటి వృథాను అరికట్టి భవిష్యత్తు తరాల మనుగడకు పునాదులు వేసే ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలని సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్ తెలిపారు. సేవ్ వాటర్ సేవ్ లైఫ్ పేరుతో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారాస్టేట్స్‌కాలనీలో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మంచినీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరణం శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు, వాహనాల పరిశుభ్రత పేరుతో కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా నీటిని వృథా చేస్తున్నారని తెలిపారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే నీరు దొరకక ప్రజలు అల్లాడి పోతున్నారని కనీసం తాగునీరు లభించని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రతి చుక్కా నీటిని ఒడిసి పట్టుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయన్న వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలని సూచించారు. కాలనీవాసులు ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సహారాస్టేట్స్‌కాలనీలో సుమారు 1200 కుటుంబాలు నివసిస్తున్నాయని కాలనీలో ఇప్పటి వరకు మంచినీటి ఇబ్బందులు తలెత్త లేదని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నామని ఎవరైనా కాలనీవాసులు నీటిని వృథా చేస్తూ రోడ్లపైకి వదిలితే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు రేణుకుంట్ల రాఘవేందర్, కోశాధికారి జగత్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాపోలు విశ్వనాథ్, కాలనీవాసులు కరుణాకర్‌రెడ్డి, కోట్ల శ్యామ్, కృష్ణమోహన్, సౌభాగ్యలక్ష్మి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సహారాస్టేట్స్‌కాలనీలో మంచినీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్ తదితరులు

వనస్థలిపురం ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, చింతల రవికుమార్ తదితరులు

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు

వనస్థలిపురం, ఏప్రిల్ 7: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలో ముదబ్బీర్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోదర భావంలో దేశానికి మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలన్నారు. అందరి సంస్కృతీసంప్రదాయాలను గౌరవించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కొలిశెట్టి సంజ్‌యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాహెబ్‌నగర్‌లో..

సాహెబ్‌నగర్‌లోని జమా మసీద్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపవాసాలు ఉన్న ముస్లిం సోదరులకు సూచనలు చేశారు. వేసవిలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. నిర్వాహకుడు అబీద్ అలీని ఆమె అభినందించారు.

ఎండలో బస్సుకోసం వేచి ఉన్న ప్రజలు

ఎండకు తట్టుకోలేక షాపుల ముందు కూర్చున్న ప్రయాణికులు

నిలువ నీడలేదాయే..!

కందుకూరు, ఏప్రిల్ 7: భానుడి భగభగతో వాతావరణం నిప్పులకొలిమిలా మారడంతో ప్రజలు ఉక్కిరిబిక్కరి అవుతున్నారు. దీంతో కందుకూరు మండల కేంద్రలో ఆర్టీసీ బస్ స్టాప్‌లో షెల్టర్లు లేకపోవడంతో ప్రజలు ఎండలో బస్ కోసం నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి నీడకు నిల్చుంటున్నారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిలోని కందుకూరు, దెబ్బడగూడ, రాచులూరు, కొత్తూరు, కొత్తగూడ తదితర బస్ స్టాపుల్లో ప్రయాణికులు వేచి ఉండేందుకు షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పంచాంగం ఆవిష్కరణ

బడంగ్‌పేట, ఏప్రిల్ 7: బడంగ్‌పేటలోని పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం క్రోధి నామ సంవత్సర తెలుగు పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు రాఘవ రావు, విరాట్ స్వరూప్, చక్రవర్తులు జగన్మోహనాచార్యులు, నవీన్, రాంబాబు, ప్రకాశ్, శ్రీనివాస్ రావు, కార్తీక్, భార్గవి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంకు కాలనీ కార్యవర్గం

మన్సూరాబాద్, ఏప్రిల్ 7: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్‌బ్యాంకు కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం కాలనీలోని కమ్యూనిటీ హాల్లో నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కిడి తిరుమల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా భైరవ్‌రెడ్డి, విద్యాసాగర్, ప్రధానకార్యదర్శిగా ఠాగూర్ రాకేశ్‌సింగ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా హరీశ్‌రెడ్డి, కోశాధికారిగా డీజే గోవర్ధన్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా మధుసూదన్‌రెడ్డి, సురేశ్‌కుమార్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, జే.మధుసూదన్‌రెడ్డి, సలహాదారులుగా వినోద్‌ప్రసాద్, గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీసుకెళ్లి వాటిని సత్వరమే పరిష్కరిస్తానన్నారు.